సాక్షి హనుమకొండ

శుక్రవారం | 17 | అక్టోబర్ | 2025

I



బీసీల రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేని పార్టీలు

బీసీల రిజర్వేషన్ల కల్పనపై ఏ రాజకీయ పార్టీకి చిత్తశుద్ధి లేదని బీసీ జేఏసీ ఉమ్మడి జిల్లా చైర్మన్ వేణుగోపాల్ గౌడ్ అన్నారు.

- IIలో



అందుబాటులోకి తేవాలి..

సాహిత్య సభలు నిర్వహించుకునేందుకు కాళోజీ కళాక్షేత్రాన్ని అందుబాటులోకి తేవాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్ అన్నారు.

IIలో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 31°/22°

జిల్లాలో ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం వేళ సాధారణంగా ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

20న లక్ష్మీ పూజలు, 21న నోములు

హన్మకొండ కల్చరల్: ఈనెల 20న (సోమవారం) ఉదయం మంగళ హారతులిచ్చి, సాయంత్రం ధనలక్ష్మి పూజలు నిర్వహించి దీపావళి పండుగను జరుపుకోవాలని, 21న మంగళవారం కేదారేశ్వర నోములు నిర్వహించుకోవాలని తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ, వేయి స్తంభాల ఆలయ అర్చకుడు గంగు మణికంఠ అవధాని, వరంగల్ రాజరాజేశ్వరీదేవి దేవాలయం అర్చకుడు ఎల్లంభట్ల లక్ష్మణశర్మ, ఎల్కతుర్తి మండలం వల్లభాపూర్ గ్రామం శ్రీపశుపతినాథ్ దేవాలయ అర్చకుడు సదానీరంజన్ సిద్ధాంతి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. అక్టోబర్ 21వ తేదీ మంగళవారం రోజున సూర్యోదయ సమయానికి ఉన్న అమావాస్య తిథిని ప్రామాణికంగా తీసుకుని కేదారేశ్వర వ్రతాలు నిర్వహించుకోవచ్చని బుధవారం (అక్టోబర్ 22)న నోము ఎత్తుకోవచ్చని తెలిపారు. ఈ సంవత్సరం స్వాతి నక్షత్రం లేని కారణంగా కొత్త నోములు చేపట్టవద్దని, పడిపోయిన నోములు చేయరాదని వివరించారు.

నేడు విద్యుత్ సర్కిల్ ఎస్ఈతో ఫోన్ ఇన్

హన్మకొండ: విద్యుత్ వినియోగదారుల సమస్యలు తెలుసుకునేందుకు ఈనెల 17 ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ సర్కిల్ ఎస్ఈ పి.మధుసూదన్‌రావు తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే ఈకార్యక్రమంలో హనుమకొండ జిల్లా వినియోగదారులు 87124 84506 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు వివరించాలని, సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

వరంగల్ సర్కిల్ ఎస్ఈతో..

విద్యుత్ వినియోగదారులకు మరింత నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరాలో భాగంగా సమస్యలు, సలహాలు తెలుసుకునేందుకు ఈనెల 17న ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ వరంగల్ సర్కిల్ ఎస్ఈ కె.గౌతంరెడ్డి తెలిపారు. వరంగల్ జిల్లా వినియోగదారులు శుక్రవారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు నిర్వహించే ఈకార్యక్రమంలో 87124 84818 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలపాలని, సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

యూత్ పార్లమెంట్‌కు పేర్లు నమోదు చేసుకోవాలి



కేయూ క్యాంపస్: వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్–26ను నిర్వహించేందుకు కేయూలోని కో–ఎడ్యుకేషన్ ఇంజనీరింగ్ కళాశాల ఎంపికైంది. ఇందులో పాల్గొనాలనుకునే విద్యార్థులు తమ పేర్లను 'మై భారత్ పోర్టల్'లో నమోదు చేసుకోవాలని ఆ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రమణ గురువారం తెలిపారు. వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్‌ను జిల్లాలో నిర్వహించేందుకు కేయూ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ రమణ, హనుమకొండలోని నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ అన్వేశ్ చింతల, కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం సమక్షంలో అవగాహన ఒప్పందంపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో కేయూ ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ, ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శైలజ, ఎం.సౌజన్య పాల్గొన్నారు.

దీపావళి పండుగకు ప్రత్యేక రైళ్లు

అక్టోబర్ 20 నుంచి 10 సర్వీసులు

కాజీపేట రూరల్: దీపావళి పండుగను పురస్కరించుకుని దర్భాంగా–యశ్వంత్‌పూర్ మధ్య 10 ప్రత్యేక రైళ్ల సర్వీసులను నడిపిస్తున్నట్లు గురువారం దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్ఓ ఎ.శ్రీధర్ తెలిపారు. కాజీపేట జంక్షన్ మీదుగా నడిచే ఈ రైళ్లు ఈ నెల 20వ తేదీ నుంచి నవంబర్ 11 వరకు ప్రతీ సోమవారం దర్భాంగా–యశ్వంత్‌పూర్ (05541) వెళ్లే ఎక్స్‌ప్రెస్ మరుసటి రోజు కాజీపేట జంక్షన్‌కు చేరుకుని వెళ్తుంది. అదేవిధంగా అక్టోబర్ 23వ తేదీ నుంచి నవంబర్ 20వ తేదీ వరకు యశ్వంత్‌పూర్–దర్భాంగా (05542) వెళ్లే ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారం కాజీపేట జంక్షన్‌కు చేరుకుని వెళ్తుంది. 3–ఏసీ, స్లీపర్ క్లాస్, జనరల్, సెకెండ్ క్లాస్ కోచ్‌లతో ప్రయాణించే ఈ రైళ్ల సర్వీసులకు అప్ అండ్ డౌన్ రూట్‌లో సమస్తిపూర్, ముజఫర్‌పూర్, హాజీపూర్, సోనాపూర్, చాప్రా, గ్రామీణ్, సివన్, డోరియోసాదర్, గోరఖ్‌పూర్, గోండా, బారబంకి, అశీష్‌బాగ్, కాన్‌పూర్‌సెంట్రల్, ఓరియా, వీజీఎల్ ఝాన్సీ, బీనా, భోపాల్, ఇటార్సీ, జోద్‌పూర్, కాబిన్, ఆమ్లా, నాగ్‌పూర్, చంద్రాపూర్, బల్లార్షా, రామగుండం, కాజీపేట జంక్షన్, కాచిగూడ, మహబూబ్‌నగర్, దోనే, ధర్మవరం, హిందుపూర్, ఎలహంకా స్టేషన్‌లో హాల్టింగ్ కల్పించారు.



పరుగు పోటీల్లో తలపడుతున్న మహిళా అథ్లెట్లు



హై జంప్ చేస్తున్న క్రీడాకారుడు



లాంగ్‌జంప్ చేస్తున్న అథ్లెట్

నేషనల్ అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం

హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో గురువారం జాతీయస్థాయి 5వ అథ్లెటిక్స్ అండర్–23 చాంపియన్‌షిప్ పోటీలు షురూ అయ్యాయి. మూడు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో మొత్తం 52 ఈవెంట్లలో 937 మంది అథ్లెట్లు పాల్గొంటున్నారు. మొదటిరోజు ఈవెంట్లను వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.

- IIలో

- వరంగల్ స్పోర్ట్స్

'కొండా' వివాదం సమసినట్లేనా..?

హీటెక్కిన వరంగల్ రాజకీయాలు

- మాజీ ఓఎస్డీ సుమంత్ కోసం 'టాస్క్‌ఫోర్స్'..
- కలకలం రేపిన కొండా సుస్మిత వ్యాఖ్యలు
- సీఎం రేవంత్‌రెడ్డితో విభేదాలు లేవన్న కొండా మురళి
- కేబినెట్ మీటింగ్‌కు వెళ్లని మంత్రి సురేఖ.. హాట్ టాపిక్‌గా తాజా పరిణామాలు

సాక్షిప్రతినిధి, వరంగల్ :

సంచలనంగా మారిన మంత్రి కొండా సురేఖ దంపతులు, ఆమె కూతురు సుస్మిత వ్యాఖ్యల వివాదం సమసినట్లేనా.. ఈ వివాదంపై కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఏం నిర్ణయం తీసుకోబోతోంది.. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని కొండా సురేఖ ఇంటికి టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఎందుకు వెళ్లారు.. ఈ సందర్భంగా సుస్మిత చేసిన వ్యాఖ్యల పర్యవసానం ఏంటి? ఇంతకీ వివాదానికి కారణమైన మాజీ ఓఎస్డీ సుమంత్ ఎక్కడ? కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టిని కలిసిన సురేఖ.. కీలకమైన కేబినెట్ మీటింగ్‌కు ఎందుకు వెళ్లలేదు? ఇవన్నీ ఇప్పుడు పొలిటికల్ సర్కిల్‌లో హాట్‌టాపిక్‌గా మారాయి. 48 గంటలుగా తాజా రాజకీయ



కొండా దంపతులు

పరిణామాలు వరంగల్‌ను హీటెక్కించాయి.

సుమంత్ కోసం పోలీసులు.. కలకలం రేపిన సుస్మిత వ్యాఖ్యలు..

మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల మధ్య విభేదాలు పక్కన పెడితే... మాజీ ఓఎస్డీ సుమంత్ కోసం టాస్క్‌ఫోర్స్ పోలీసులు వెళ్లడం.. అక్కడ సురేఖ కూతురు సుస్మిత చేసిన వ్యాఖ్యలు కలకలంగా మారాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, సలహాదారు వేం నరేందర్ రెడ్డి తదితరులు తన తల్లిదండ్రులపై కుట్ర చేస్తున్నారంటూ సుస్మిత ఘాటైన విమర్శలు చేశారు. కొండా సురేఖ, మురళికి ఏం జరిగినా పరిణామాలు తీవ్రంగా ఉంటాయని కూడా ఆమె హెచ్చరించారు. దీంతో ఇటు కాంగ్రెస్ పార్టీలో.. అటు అధికారవర్గాల్లో ఆమె వ్యాఖ్యలు దుమారం రేపాయి. ఇదే సమయంలో వరంగల్‌లో మీడియాతో మాట్లాడిన కొండా మురళీధర్ సీఎం రేవంత్‌రెడ్డితో తమకు విభేదాలు లేవని, తనకు ఎమ్మెల్సీ కూడా ఇస్తామని చెప్పారన్నారు. సుస్మిత ఎక్కడ.. ఎప్పుడు.. ఏం మాట్లాడిందో తనకు తెలియదని కొట్టిపారేశారు. మాజీ ఓఎస్డీ సుమంత్ కోసం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఎందుకు వెళ్లారు? ఇంతకీ అతను ఎక్కడున్నాడు? ప్రభుత్వం తదుపరి ఏం చేయబోతుంది? అనే అంశాలపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది.

కేబినెట్‌కు ఎందుకు వెళ్లలేదు.. అసలేం జరుగుతోంది?

రెండు రోజులుగా జరుగుతున్న వివాదాల నేపథ్యంలో గురువారం జరిగిన కీలకమైన మంత్రివర్గ సమావేశానికి మంత్రి కొండా సురేఖ హాజరుకాకపోవడం హాట్‌టాపిక్‌గా మారింది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్‌ను కలిసిన కొండా సురేఖ, ఆమె కూతురు సుస్మితలు.. టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌తో కూడా భేటీ అయ్యారు. ఆ తర్వాత డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కూడా కలిసినట్లు మీడియాలో వార్తలు వచ్చాయి. మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌లను కలిసిన కొండా సురేఖ.. 48 గంటల్లో జరిగిన పరిణామాలను వివరించినట్లు తెలిసింది. పార్టీపరంగా, కొందరు ప్రజాప్రతినిధుల వల్ల తమకెదురవుతున్న ఇబ్బందులను వారి దృష్టికి తీసుకెళ్లినట్లు కూడా మీడియాతో మాట్లాడిన సురేఖ స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే.. మీనాక్షి నటరాజన్, మహేశ్‌కుమార్‌తో భేటీ అయిన సురేఖ, ఆ తర్వాత జరిగిన కేబినెట్ మీటింగ్‌కు హాజరుకాకపోవడం కొత్త వివాదానికి తెర తీసింది. అసలు కాంగ్రెస్ పార్టీ పెద్దలతో మాట్లాడిన సురేఖకు వారు ఏం భరోసా ఇచ్చారు? అక్కడినుంచి కేబినెట్ మీటింగ్‌కు వెళ్లాల్సిన ఆమె ఎందుకు వెళ్లలేదు? కావాలనే వెళ్లలేదా? లేక ఎవరైనా వద్దని చెప్పారా? ఈ నేపథ్యంలో కొండా దంపతులకు ఏమైనా ప్రత్యేక వ్యూహం ఉందా? అసలు కాంగ్రెస్ పార్టీలో ఏం జరుగుతోంది..? అన్న అంశాలు అన్ని వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.

'సీఈఏ' నియమాలు తప్పక పాటించాలి

కలెక్టర్ స్నేహ శబరీష్

హన్మకొండ అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ క్లినిక్‌లు, ఆస్పత్రులు క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ చట్టం (సీఈఏ) నియమాలను తప్పనిసరిగ్గా పాటించేలా చూడాలని హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో డీఎంహెచ్ఓ అప్పయ్య ఆధ్వర్యంలో ఐఎంఏ, తానా, గైనకాలజిస్ట్ అసోసియేషన్, డెంటల్, ఆయుర్వేదిక్, హోమియో, యునాని, ఫిజియోథెరపీ అసోసియేషన్ల ప్రతినిధులతో ప్రభుత్వ నిబంధనలపై ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఆస్పత్రులు, క్లినిక్‌లు నిర్వహించవద్దని, చట్టం నియమాలకు అనుగుణంగా నిర్వహించడంలో అసోసియేషన్లు సహకరించాలని ఆదేశించారు. ప్రైవేట్ ఆస్పత్రుల వద్ద పార్కింగ్ స్థలం ఉండేలా ఆస్పత్రుల యాజమాన్యాలు చూసుకోవాలన్నారు. కొత్తగా ఏర్పాటు చేసే ఆస్పత్రులు నిబంధనల మేరకు నిర్మించాలని, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్‌ను తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ప్రతీ ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, జిమ్ సెంటర్లు, అవసరమైన ఇతర




మాట్లాడుతున్న కలెక్టర్ స్నేహ శబరీష్

చోట్ల సీపీఆర్ ప్రాముఖ్యాన్ని గురించి తెలియజేస్తూ శిక్షణ ఇవ్వడానికి అసోసియేషన్లు సహకరించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగార్జున రెడ్డి, రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్ రెడ్డి, గైనకాలజిస్ట్‌ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ శ్రీలక్ష్మి, డాక్టర్ రాధిక, ఐడీఏ అధ్యక్షుడు డాక్టర్ ప్రీతంరెడ్డి, ఆయుర్వేదిక్ అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ రవీందర్, హోమియో అసోసియేషన్ ప్రతినిధి డాక్టర్ సుధాకర్‌రావు, ఫిజియోథెరపీ అసోసియేషన్ ప్రతినిధి సురేశ్‌కుమార్, స్టాటిస్టికల్ అధికారి ప్రసన్నకుమార్, డెమో అశోక్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బైక్ అదుపు తప్పి రైతు మృతి

పరకాల: కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి పరకాల మున్సిపాలిటీ పరిధి సీతారాంపూర్‌కు చెందిన రైతు మేకల బాపురావు(55) గురువారం మృతి చెందాడు. బాపురావు బైక్‌పై యూరియా బస్తా వేసుకుని పొలానికి వెళ్తుండగా.. రాజీపేట వద్ద కుక్క అడ్డు వచ్చింది. అతడి వాహనం అదుపుతప్పడంతో తలకు బలమైన



బాపురావు (ఫైల్)

గాయమైంది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, స్థానికులు అతడిని పరకాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ బాపురావు మృతి చెందాడు. కాగా.. హెల్మెట్ పెట్టుకుని ఉంటే బతికేవాడేమో అని స్థానికులు చర్చించుకున్నారు. పరకాల పోలీసులు కేసు నమోదు చేశారు.

భర్తను హత్య చేసిన భార్య

ధర్మసాగర్: పెద్దపెండ్యాల గ్రామానికి చెందిన రాజారపు అశోక్(35)ను అతడి భార్య యాదలక్ష్మి చీరతో ఉరేసి హత్యచేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అశోక్, యాదలక్ష్మి దంపతులకు తరచూ గొడవలు అవుతున్నాయి. ఈక్రమంలో గురువారం సాయంత్రం ఆమె అశోక్ మెడకు చీరతో ఉరివేసి హత్య చేసింది. అశోక్ తండ్రి రాజారపు వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఈసందర్భంగా సీఐ శ్రీధర్‌రావు తెలిపారు.

కళాక్షేత్రంలో పనులు పూర్తి చేయండి

బల్దియా కమిషనర్, 'కుడా' వైస్ చైర్మన్ చాహత్ బాజ్‌పాయ్

వరంగల్ అర్బన్: కాళోజీ కళాక్షేత్రంలో పెండింగ్‌లో ఉన్న పనుల్ని త్వరగా పూర్తి చేయాలని బల్దియా కమిషనర్, 'కుడా' వైస్ చైర్మన్ చాహత్ బాజ్‌పాయ్ అన్నారు. గురువారం కాకతీయ మ్యూజికల్ గార్డెన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనుల్ని ఆమె పరిశీలించారు. కమిషనర్ వెంట సీపీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీం రావు, అధికారులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే అనుమతులు

నూతన భవనాల నిర్మాణాలకు అనుమతుల మంజూరు బడా భవన నిర్మాణాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు జారీ చేస్తామని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ సూచించారు. గురువారం కమిషనర్ నగర పరిధి ఎక్సైజ్ కాలనీ, శ్రీనివాస కాలనీ, బ్యాంక్ కాలనీ, సాయి గణేశ్ కాలనీ, చింతగట్టు ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించి నమోదు చేసిన వివరాలను కొలతలు వేసి పరిశీలించారు

విస్మరిస్తే కూల్చేయండి

భవన నిర్మాణాల్లో నిబంధనలు విస్మరిస్తే కూల్చేయాలని రాష్ట్ర పురపాలక శాఖ కార్యదర్శి శ్రీదేవి సూచించారు. గురువారం హైదరాబాద్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.


హైదరాబాద్ నుంచి వస్తుంది వాస్తవమే..

- విధులకు రాని రోజు సెలవు తీసుకుంటున్నారు
- ఎంజీఎం సూపరింటెండెంట్ కిశోర్

సాక్షి ఎఫెక్ట్

ఎంజీఎం: 'వారానికి రెండు రోజులే' శీర్షికన ఇటీవల సాక్షిలో ప్రచురితమైన కథనంపై జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎంజీఎం సూపరింటెండెంట్ కిశోర్ స్పందించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కొంత మంది వైద్యులు హైదరాబాద్ నుంచి వరంగల్‌కు వచ్చి వెళ్తూ విధులు నిర్వర్తిస్తున్న విషయాన్ని ఆయన అంగీకరించారు. ప్రతీరోజు క్రమం తప్పకుండా విధులకు వస్తూ ఓపీ విభాగంలో రోగులకు సేవలందించడంతో పాటు, ఎంజీఎం ఆస్పత్రితో పాటు కళాశాల ప్రాంగణంలో వైద్యవిద్యార్థులకు సంబంధించిన అకడమిక్ విభాగాల్లో సేవలందిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్యుల అటెండెన్స్ నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు అనుసంధానం చేసినట్లు పేర్కొన్నారు. వైద్య బోధన చేసే వైద్యులంతా తమ పేర్లతో పాటు ఫేస్ బేస్డ్ బయోమెట్రిక్ విధానానికి అనుసంధానం జరిగిందని తెలిపారు. కాగా, నిబంధనల ప్రకారం అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు అందించే వైద్యులు హైదరాబాద్ నుంచి విధులకు రావొచ్చా? హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉండాలా? అనే నిబంధన ఉందా.. అనే అంశంపై రాష్ట్ర స్థాయి అధికారులను అడిగి తెలుపుతామని సూపరింటెండెంట్ కిశోర్ పేర్కొన్నారు.

వైన్స్ దరఖాస్తుల జోరు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

కాజీపేట అర్బన్ : హనుమకొండ (వరంగల్ అర్బన్) జిల్లాలోని 67 వైన్స్‌కు గురువారం దరఖాస్తులు జోరందుకున్నాయి. గురువారం రాత్రి 8 గంటల వరకు దరఖాస్తులను మద్యం వ్యాపారులు అందజేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్ తెలిపారు. టెండర్ల ప్రక్రియ వెలువడిన నాటి నుంచి గురువారం వరకు 540 దరఖాస్తులు అందినట్లు చెప్పారు.

'విజిలెన్స్'లో అక్రమార్కుడు

వసూళ్లలో దిట్ట

- పేరుకే కానిస్టేబుల్.. పెత్తనం పెద్దది
- లీకులకు పెట్టింది పేరు
- అక్కడ ఆయనే బాస్

వరంగల్ క్రైం: ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న అవినీతిని ఎండగట్టి.. అక్రమార్కులపై చర్యలకు సిఫార్సు చేసే విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో ఓ అక్రమార్కుడు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా నడుస్తోంది. విజిలెన్స్‌లో పని చేస్తున్న ఓ ఉన్నతాధికారికి నమ్మిన బంటైన సదరు కానిస్టేబుల్‌ను ఏరి కోరి డిప్యుటేషన్‌పై తెచ్చుకున్నారు. ఇంకేముంది వసూళ్లకు పెట్టింది పేరైన సదరు కానిస్టేబుల్ పేరు చెబితే డీఎస్పీ, ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారులకు కూడా చెమటలు పడుతున్నాయి! ప్రభుత్వ శాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులతో పాటు విచారణలు, తనిఖీలకు ప్రాధాన్యం ఉన్న విజిలెన్స్‌లో ఈ అక్రమార్కుడి సంపాదన మూడు పువ్వులు.. ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ఇసుక క్వారీలు, రైస్ మిల్లులు, గ్రానైట్ క్వారీలు, ఫర్టిలైజర్స్, ఇలా ఎక్కడ చూసినా తన చేతికి పనిచెబుతున్నట్లు ఆరోపణలున్నాయి.

ఎంత చెబితే అంత!

విజిలెన్స్‌లో ఉద్యోగం కానిస్టేబులే అయినప్పటికీ పెత్తనం మాత్రం అంతా ఇంతా కాదు. ఆ శాఖలో పనిచేస్తున్న పోలీస్ ఉన్నతాధికారులు సైతం ఇతగాడి నోటి నుంచి ఏం వస్తుందో.. దాని వల్ల వారికి ఎలాంటి ఇబ్బందులు వస్తాయో.. అనే భయంతో వణికిపోతున్నట్లు సమాచారం. ఆ శాఖలో ఆయనకు పనికాదు కదా.. ఎదురు చెప్పే ధైర్యం కూడా



విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయం

ఎవరూ చేయడం లేదు. తనను ఏరి కోరి తెచ్చుకున్న బాస్‌కు అన్నీ తానై చేయడంతో మిగిత అధికారులంతా గప్‌చుప్‌గా ఉంటున్నారు. మట్టి, ఇసుక, గ్రానైట్ లారీలను పట్టాలన్నా.. వాటికి జరిమానాలు విధించాలన్నా ఆయన కనుసన్నల్లోనే జరగడం గమనార్హం. తనకు అనుకూలంగా ఉండే లారీల యాజమానులకు ముందస్తుగా తనిఖీల సమాచారాన్ని చేరవేసి.. దానికి కాసుల రూపంలో ప్రతిఫలాన్ని పొందడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య. ఎవరైనా విజిలెన్స్ కార్యాలయంలో అధికారులను కలవాలంటే ముందుగా ఇతగాడిని ప్రసన్నం చేసుకున్న తర్వాతే దర్శనం దొరుకుతుంది. పూర్వ వరంగల్, ఖమ్మం జిల్లాల్లో ఎక్కడ చూసినా ఆ కానిస్టేబుల్ పేరే వినబడుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాలతో సంబంధం లేకుండా ఎక్కడికైనా, ఎప్పుడైనా వెళ్లి ఆయన పనులు గుట్టు చప్పుడు కాకుండా చేసుకుపోతున్నట్లు తెలిసింది. నెలవారీ మామూళ్లను సైతం తనకు ఇష్టం వచ్చినట్లు పెంచి.. ఇవ్వని క్వారీల, లారీల యాజమానుల వెంట పడుతున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈతతంగమంతా విజిలెన్స్ బాస్ కనుసన్నల్లో జరుగుతున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఆస్పత్రి పనులు పూర్తి చేయాలి

వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్యశారద

ఎంజీఎం: వరంగల్‌లో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి కలెక్టర్ గురువారం సందర్శించి సంబంధిత అధికారులతో పనుల పురోగతిపై సమీక్షించారు. సివిల్, ఎలక్ట్రికల్ పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి అంతస్తులోని నిర్మాణ స్థితిగతులను తెలుసుకోవాలని సూచించారు. అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు సంబంధిత శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేయాలన్నారు. సమావేశంలో ఎంజీఎం హాస్పిటల్ సూపరింటెండెంట్ కిశోర్, కేఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యారాణి, ఆర్ఎంఓలు, వివిధ విభాగాల అధిపతులు, ఆర్అండ్‌బీ ఇంజనీర్లు, ఎల్ అండ్‌టీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంట ఉత్పత్తుల కొనుగోళ్లు చేపట్టాలి

న్యూశాయంపేట: పారదర్శకంగా పంట ఉత్పత్తుల కొనుగోళ్లను చేపట్టాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్‌లో ధాన్యం పత్తి, మొక్కజొన్నల కొనుగోళ్లపై గురువారం నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వ మద్దతు ధరలతో పంటల కొనుగోళ్లకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. జెడ్పీ సీఈఓ,



మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద

ఇన్‌చార్జ్ డీఆర్‌డీఓ రాంరెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ పాల్గొన్నారు.


గడువులోగా ఇందిరమ్మ ఇళ్లు పూర్తిచేయాలి

నిర్ణీత గడువులోగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం ఇందిరమ్మ ఇళ్ల పురోగతి, ఉపాధి హామీ పథకం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 9,457 ఇళ్లకు ఇప్పటివరకు 4,941 ఇళ్లు గ్రౌండింగ్ అయ్యాయని తెలిపారు. ఎస్‌హెచ్‌జీల నుంచి రుణాలు ఇప్పించి పెండింగ్‌లో ఉన్న 4,516 ఇళ్ల పనులు చేపట్టాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఉపాధి హామీలో పని కల్పించుటకు జాబ్ కార్డులు అందించాలన్నారు. జెడ్పీ సీఈఓ రాంరెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్న, హౌసింగ్ పీడీ గణపతి, డీపీఓ కల్పన, పీఆర్ ఈఈ ఇజ్జగిరి పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందించాలి

పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్

హసన్‌పర్తి: పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు సత్వర న్యాయం అందించాలని పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ సూచించారు. హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌ను గురువారం సీపీ సందర్శించారు. ఈసందర్భంగా పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలించి స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏయే గ్రామాల నుంచి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నాయని, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను తెలుసుకున్నారు. రౌడీ షీటర్లు, అనుమానిత వ్యక్తుల వివరాలతో పాటు స్టేషన్ అధికారులు, సిబ్బంది నిర్వహిస్తున్న విధుల గురించి తెలుసుకున్నారు. హనుమకొండ–కరీంనగర్ ప్రధాన రహదారిలోని స్టేషన్ పరిధిలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు. నిజాయితీగా విధులు నిర్వహిస్తూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని సిబ్బందికి సూచించారు. తొలుత సీపీకి



వివరాలు తెలుసుకుంటున్న సీపీ సన్‌ప్రీత్ సింగ్

పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాజీపేట ఏసీపీ పశాంత్‌రెడ్డి, స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు, ఎస్సై దేవేందర్, రవి పాల్గొన్నారు.

రాయితీపై వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు

జిల్లా వ్యవసాయాధికారి రవీందర్ సింగ్

హన్మకొండ: వ్యవసాయ యాంత్రీకరణకు రాయితీపై పనిముట్లు, వ్యవసాయ పరికరాలు అందిస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి రవీందర్ సింగ్ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, మహిళా చిన్న, సన్నకారు రైతులకు 50 శాతం, ఇతర రైతులకు 40 శాతం రాయితీపై వ్యవసాయ పరికరాలు, పనిముట్లు అందించనున్నట్లు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ పరికరాలు అవసరమైన రైతులు తమ మండల వ్యవసాయాధికారిని సంప్రదించాలని సూచించారు. మండలాల వారీగా పరికరాలు కేటాయించినట్లు తెలిపారు. జిల్లాకు బ్యాటరీ, ఫుట్ మాన్యువల్ ఆపరేటెడ్ స్ప్రేయర్లు 1886, పవర్ స్ప్రేయర్లు 387, రోటోవేటర్లు 96, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్ 18, డిస్క్ హారో, కల్టివేటర్, ఎంబీ ప్లవ్, కేజీవీల్స్ రోటో పడ్లర్ 131, బండ్ ఫార్మర్ 9, పవర్ వీడర్ 17, బ్రష్ కట్టర్ 25, పవర్ టిల్లర్లు 17, స్ట్రా బేలర్లు 19 మంజూరైనట్లు వివరించారు.

క్లుప్తంగా

రాష్ట్ర స్థాయి బాలికల వాలీబాల్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక



మాట్లాడుతున్న సైకాలజిస్టు బరుపాటి గోపి

వరంగల్ స్పోర్ట్స్: సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు జరుగనున్న ఎస్‌జీఎఫ్ అండర్–19 రాష్ట్ర స్థాయి బాలికల వాలీబాల్ పోటీలకు ఉమ్మడి వరంగల్ జిల్లా జట్టును ఎంపిక చేశారు. గురువారం హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని వాలీబాల్ మైదానంలో ఉమ్మడి జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించారు. 120 మంది బాలికలు హాజరుకాగా, ఇందులో ప్రతిభ కనబరిచిన 12మందితో ఉమ్మడి జిల్లా జట్టును ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లా కార్యదర్శి నరెడ్ల శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ బరుపాటి గోపి, ఎస్‌జీఎఫ్ అండర్–19 మాజీ కార్యదర్శి డాక్టర్ కోట సతీశ్, పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎ. ప్రభాకర్‌రెడ్డి, కార్యదర్శి దరిగి కుమార్, డీఎస్‌ఏ వాలీబాల్ కోచ్ బత్తిని జీవన్‌గౌడ్ పాల్గొన్నారు.

ఎంబీఏ, ఎంసీఏలో స్పాట్ అడ్మిషన్లు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్‌కళాశాల, సుబేదారిలోని యూనివర్సిటీ పీజీ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం(2025–2026)లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించనున్నట్లు ఆ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఎస్. జ్యోతి, నర్సింహాచారి గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ నెల 17నుంచి 21వ తేదీ వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అన్ని విద్యార్హతల ఒరిజనల్ సర్టిఫికెట్లుతోపాటు ఆధార్, ఐసెట్ ర్యాంకు కార్డును తీసుకురావాలన్నారు. టీజీఐసెట్ 2025 అర్హత సాధించినవారు, అర్హతసాధించలేకపోయిన అభ్యర్థులు కూడా ఈ స్పాట్ అడ్మిషన్లకు అర్హులేనని వారు తెలిపారు. పూర్తి వివరాలకు టీజీఐసెట్.ఎస్ఐసీ.ఇన్ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు. కళాశాలల వారీగా మిగిలిన సీట్ల వివరాలు మార్గదర్శకాలు కూడా ఆ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

బాటనీ హెచ్‌ఓడీతోపాటు కాంట్రాక్టు లెక్చరర్లకు షోకాజ్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ బాటనీ విభాగం అధిపతితోపాటు నలుగురు కాంట్రాక్టు లెక్చరర్లు, నలుగురు నాన్‌టీచింగ్ ఉద్యోగులకు షోకాజ్ నోటీస్‌లు జారీచేసినట్లు యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ మనోహర్ గురువారం తెలిపారు. ఇటీవల వీసీ ప్రతాప్‌రెడ్డి బాటనీ విభాగాన్ని తనిఖీ చేయగా ఆవిభాగ అధిపతితో సహా నలుగురు కాంట్రాక్టు లెక్చరర్లు, మరో నలుగురు నాన్‌టీచింగ్ ఉద్యోగులు విధుల్లో లేరనే విషయం వెల్లడైందన్నారు. దీంతో వారికి షోకాజ్ నోటీస్‌లు జారీచేసినట్లు తెలిపారు. ఇదిలాఉండగా గురువారం కేయూలోని అకడమిక్ కమిటీహాల్‌లో వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం బాటనీ విభాగం అధిపతి, కాంట్రాక్టు లెక్చరర్లతో సమావేశం నిర్వహించినట్లు సమాచారం. విధుల్లో సమయపాలన పాటించాలనే విషయం, తరగతుల నిర్వహణ, తదితర అంశాలపై చర్చ సాగినట్లు తెలిసింది.



హామర్ త్రో చేస్తున్న క్రీడాకారుడు



హైజంప్ చేస్తున్న క్రీడాకారిణి



100 మీటర్ల పరుగు పందెంలో పోటీ పడుతున్న క్రీడాకారులు

ఒలింపిక్స్ క్రీడల నిర్వహణకు కృషి

- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- జేఎన్‌ఎస్‌లో నేషనల్ అథ్లెటిక్స్ మీట్ ప్రారంభం



మాట్లాడుతున్న ఎంపీ కడియం కావ్య, వేదికపై కలెక్టర్ స్నేహశబరీష్, మేయర్ సుధారాణి, తదితరులు

వరంగల్ స్పోర్ట్స్: భారత్‌లో 2036లో జరుగనున్న ఒలింపిక్స్ పోటీల్లో కొన్ని క్రీడలను తెలంగాణలో నిర్వహించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మూడు రోజులు జరుగనున్న జాతీయ స్థాయి 5వ అథ్లెటిక్స్ అండర్–23 చాంపియన్‌షిప్ గురువారం ప్రారంభమైంది. ఈ పోటీల ప్రారంభోత్సవానికి ఎంపీ కావ్య ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2026లో జరుగనున్న ఖేలో ఇండియా క్రీడా పోటీలను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలన్నారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ రూ.3.50 కోట్ల వ్యయంతో స్టేడియంలో అభివృద్ధి పనులు చేపట్టామని, త్వరలో ఫ్లడ్‌లైట్లు ఇతర వసతుల కోసం మరిన్ని నిధులు కేటాయిస్తామన్నారు. హనుమకొండ కలెక్టర్ స్నేహశబరీష్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు ప్రోత్సాహం అందిస్తున్నాయన్నారు. మెరుగైన శిక్షణ కోసం క్రీడాకారులు పట్టుదలతో ముందుకెళ్లాలన్నారు. అనంతరం 10వేల మీటర్ల పరుగులో విజేతలకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్, తెలంగాణ అథ్లెటిక్స్ అసోసియేషన్ చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, కార్యదర్శి కె. సారంగపాణి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ అజీజ్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.



డిస్కస్ త్రో వేస్తున్న క్రీడాకారిణి



షార్ట్‌పుట్ వేస్తున్న క్రీడాకారుడు



పోల్ వాల్ట్‌లో క్రీడాకారుడు



లాంగ్‌జంప్ చేస్తున్న క్రీడాకారిణి

క్రీడాకారులకు గాయాలు.. 108లో ఎంజీఎంకు తరలింపు

జేఎన్‌ఎస్‌లో జరుగుతున్న అథ్లెటిక్స్ పోటీల్లో ఇద్దరు క్రీడాకారులు, ఒక టెక్నికల్ అఫీషియల్ గాయపడ్డారు. హరియాణ రాష్ట్రానికి చెందిన సోనూయాదవ్ లాంగ్‌జంప్ చేస్తుండగా ఎడమ కాలు మణికట్టులో గాయమైంది. మరో క్రీడాకారిణి త్రివేణికి సైతం మణికట్టులో స్వల్ప గాయం కాగా అక్కడే విధుల్లో ఉన్న 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం ఈఎంటీ చైతన్య, పైలెట్ కొండ తిరుపతిలు ఎంజీఎం తరలించారు. కాగా, టెక్నికల్ అఫీషియల్ శివకుమార్ కుడి చేయి మధ్య వేలుకు గాయం కాగా చికిత్స అందించారు.



గాయపడిన అథ్లెట్‌కు ప్రథమ చికిత్స చేస్తున్న 108 ఈఎంటీ చైతన్య

మొదటి రోజు 11 ఈవెంట్లు పూర్తి..

చాంపియన్‌షిప్‌లో భాగంగా మొదటి రోజు గురువారం 30 ఈవెంట్లలో పోటీలు నిర్వహించారు. ఉదయం 6 నుంచి 10: 30 గంటల వరకు, తిరిగి 12 నుంచి సాయంత్రం 6:30గంటల వరకు పోటీలు జరిగాయి. 30 ఈవెంట్లలో 11 ముగిశాయి. మిగిలిన ఈవెంట్లు శుక్రవారం కొనసాగుతాయి. **10,000 మీటర్ల పురుషుల పరుగు :** రిజ్వాన్(ఇండోర్) ప్రథమ స్థానం, సచిన్‌యాదవ్(ఉత్తర్‌ప్రదేశ్) ద్వితీయ, శివాజీకాశీరామ్(కర్నాటక) తృతీయ స్థానంలో నిలిచారు. **10000 మీటర్ల మహిళల విభాగం :** లతికతల్వార్(రాజస్తాన్) ప్రథమ స్థానం, ఆర్తిపవారా(మహారాష్ట్ర) ద్వితీయ, భూమ్రాగౌరి(మధ్యప్రదేశ్)తృతీయ స్థానం, **షార్ట్‌పుట్ మహిళల విభాగం:** సిమ్రాన్‌జిత్‌కౌర్(ఢిల్లీ) ప్రథమ స్థానం, ఝులక్‌చాహల్(ఉత్తర్‌ప్రదేశ్)ద్వితీయ,పూజకుమారి(ఎన్‌సీఓపీ) తృతీయ స్థానం, **హైజంప్ మహిళల విభాగం :** సీమకుమారి(ఉత్తర్‌ప్రదేశ్) ప్రథమ స్థానం, సారికకుమావత్(రాజస్తాన్)ద్వితీయ, రింపల్‌కౌర్(పంజాబ్)తృతీయ స్థానం, **డిస్కస్‌త్రో మహిళల విభాగం:** నిఖితకుమారి(ఎన్‌సీఓపీ, ఆర్గనైజేషన్) మొదటిస్థానం, కిరణ్(రాజస్తాన్)ద్వితీయ, అఖిలరాజు(కేరళ)తృతీయ స్థానం, **హ్యామర్‌త్రో పురుషుల విభాగం:** దినేశ్ ఎస్(తమిళనాడు) ప్రథమ స్థానం, పవన్(రాజస్తాన్) ద్వితీయ, రాబిన్‌యాదవ్(ఉత్తర్‌ప్రదేశ్) తృతీయ స్థానం, **పోల్‌వాల్ట్ విభాగం:** కుమార్‌కుల్దీప్(జీఎస్‌డబ్ల్యూ,ఆర్గనైజేషన్) ప్రథమ, కవీన్‌రాజ్(తమిళనాడు)ద్వితీయ,రామ్‌రాజన్(రాజస్తాన్) తృతీయ స్థానం, **100మీటర్ల పరుగు మహిళల విభాగం:** సుదీప్న(మహారాష్ట్ర) విజేత, సాక్షి(రిలయన్స్, ఆర్గనైజేషన్) ద్వితీయ, తమన్నా(త్రివేంద్రం) తృతీయ స్థానం, **100మీటర్ల పరుగు పురుషుల విభాగం:** హరుత్యమ్‌జయరామ్(ఒడిశా) ప్రథమ, కుమార్(జార్ఖండ్)ద్వితీయ, రాట్‌మెల్గే(మహారాష్ట్ర) తృతీయ స్థానం, **లాంగ్‌జంప్ మహిళల విభాగం:** ముబాస్సిమ్(అంజుబాబీ, ఆర్గనైజేషన్) ప్రథమ, ఎంఎస్ సించనా(కర్నాటక)ద్వితీయ, వీఎం అభిరామ్(కేరళ)తృతీయ స్థానం, **1500 మీటర్ల పరుగు మహిళల విభాగం:** వినీతగుర్జర్ (ఉత్తర్‌ప్రదేశ్) ప్రథమ, లక్ష్మిప్రియకిసాన్(ఒడిశా) ద్వితీయ, భగవతిడియోరా(రాజస్తాన్)తృతీయ స్థానంలో నిలిచారు.

ఒలింపిక్స్‌లో పాల్గొనడమే లక్ష్యం



పదేళ్ల క్రితం విద్యుత్‌షాక్‌తో కుడి చేయి మోచేయి వరకు పోయింది. ఎడమ చేయి వేళ్లు పోయాయి. అయినా రన్నింగ్ ప్రాక్టీస్ ఆపలేదు. ఈ రోజు 400 మీటర్ల రన్నింగ్ రేసులో పాల్గొన్న. స్థానం దక్కించుకోలేకపోయా. నా లక్ష్యం 2028 లాస్‌ఎంజిల్స్ లో జరుగనున్న ఒలింపిక్స్‌లో పాల్గొనడమే.

భావికుమార్, గుజరాత్

ఏర్పాట్లు బాగున్నాయి



100మీటర్ల రన్నింగ్ రేసులో పాల్గొనేందుకు వచ్చా. ఇక్కడి వాతావరణం, ఫుడ్, ఇతర ఏర్పాట్లు అన్నీ బాగున్నాయి. నిర్వాహకులు చాలా సహకరించారు. ఇక్కడ పతకం సాధించి, మా రాష్ట్రానికి పేరు తీసుకురావాలని అనుకుంటున్నా.

లౌకిక్‌అనంత్, మహారాష్ట్ర

బీసీల రిజర్వేషన్లపై చిత్తశుద్ధి లేని పార్టీలు

- రేపటి బీసీ బంద్‌ను విజయవంతం చేయాలి
- తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ నాయకుల పిలుపు



బీసీ బంద్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనపై ఏ రాజకీయ పార్టీకి చిత్తశుద్ధి లేదని తెలంగాణ రాష్ట్ర బీసీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ అన్నారు. గురువారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఈ నెల 18న నిర్వహించనున్న బీసీ బంద్ విజయవంతంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్య, కార్పొరేట్ రంగాలన్నీ అగ్రవర్ణాల గుప్పిట్లో ఉన్నాయని, ఈ బంద్‌ను విఫలం చేయాలని కుట్రలు చేస్తున్నాయని మండిపడ్డారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని విద్యా సంస్థలు, పెట్రోల్ బంకులు, సినిమా హాళ్లు, హోటళ్లు, బస్సులు, ఆటోలు, షాపింగ్ మాళ్లు, ఇతర వ్యాపార, వాణిజ్య సంస్థలు స్వచ్ఛందంగా బంద్‌లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆర్గనైజేషన్ ఆఫ్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ చైర్మన్ సంగం రెడ్డి సుందర్ రాజ్ యాదవ్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని ఆర్డినెన్స్ తీసుకొచ్చిన ప్రభుత్వం.. దానిని కాపాడుకోవడం కోసం చేస్తున్న ప్రయత్నాలు హాస్యాస్పదంగా ఉన్నాయన్నారు. అనంతరం బీసీ బంద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో జెడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మరావు, ఆయా సంఘాల నాయకులు దొడ్డపల్లి రఘుపతి, దాడి మల్లయ్య యాదవ్, బోనగాని యాదగిరి గౌడ్, వైద్యం రాజగోపాల్, తమ్మెలా శోభారాణి, గద్దం భాస్కర్, సంగాని మల్లేశ్వర్, ఆకారపు మోహన్, పల్లెపు సమ్మయ్య, బచ్చు ఆనందం, ఆడెపు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్ పోటీలకు ఆహ్వానం

- వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్

వరంగల్ క్రైం: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (పోలీస్ ఫ్లాగ్ డే) సందర్భంగా జిల్లా పరిధిలోని ఫొటోగ్రాఫర్లకు ఫొటోగ్రఫీ, షార్ట్ ఫిల్మ్, విద్యార్థులకు వ్యాసరచన పోటీలను రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్నట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా ఈనెల 21 నుంచి పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో పోలీసుల త్యాగాలు, విధుల్లో పోలీసుల ప్రతిభ తెలిపేలా ఉండే ఇటీవల కాలంలో తీసిన మూడు ఫొటోలు, తక్కువ నిడివి (మూడు నిమిషాలు) గల షార్ట్ ఫిల్మ్ తీసి రాష్ట్రస్థాయి పోటీల కోసం ఈ నెల 25వ తేదీ లోపు వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పీఆర్వోకు అందజేయాలన్నారు.

నామినేషన్లు పంపాల్సిన అంశాలు..

మూఢనమ్మకాలు, ఇతర సామాజిక రుగ్మతలు, అత్యవసర సమయాల్లో పోలీసుల స్పందన, ప్రకృతి వైపరీత్యాల్లో పోలీసుల సేవ, ఇతర సందర్భాల్లో పోలీసుల కీర్తి ప్రతిష్టలు,సైబర్ నేరాలు, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, మత్తు పదార్థాల సేవనంతో అనర్థాలు, వీటిపై అవగాహన పెంపొందించే అంశాలకు సంబంధించి 2024 అక్టోబర్ నుంచి ఈ సంవత్సరం అక్టోబర్ వరకు తీసిన మూడు ఫొటోలు, షార్ట్ ఫిల్మ్‌లు మాత్రమే పంపించాలి.

వ్యాస రచన పోటీలు..

డ్రగ్స్ నివారణలో పోలీసుల పాత్ర, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండడం ఎలా? అనే అంశంపై తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ భాషల్లో 6 నుంచి పీజీ వరకు విద్యార్థులు ఈ వ్యాసరచన పోటీల్లో పాల్గొనొచ్చు. విద్యార్థులు తమ వ్యాసాలను ఈనెల 28లోపు సమర్పించాలి. ఇందులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులను రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామని, దీంతో పాటు కమిషనరేట్ పరిధిలో మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులు అందజేస్తామని సీపీ తెలిపారు.

ఏజెన్సీలో అరుదైన గద్దజాతి పక్షి ప్రత్యక్షం

- పొలాల్లో వాలిన నల్ల రెక్కల గాలిపటం (కపసి)



పొలాల్లో వాలిన నల్ల రెక్కల గాలిపటం (కపసి) పక్షి



ఎరుపు కళ్లు, నలుపు, తెలుపు రెక్కలతో ఉన్న పక్షి

వాజేడు: ఏజెన్సీ ప్రాంతంలో అరుదైన గద్దజాతి పక్షి కనిపించింది. ములుగు జిల్లా వాజేడు మండల పరిధి ఇప్పగూడెం గ్రామ సమీపంలోని పొలాల్లో నల్ల రెక్కల గాలిపటం (కపసి) పక్షి వాలింది. దీని శాస్త్రీయనామం ఎలనస్ కెరులియస్. పొడవైన రెక్కలు కలిగిన రాప్టర్, ఇది ప్రధానంగా బూడిదరంగు లేదా తెలుపు రంగులో ఉంది. ఈ పక్షిని గ్రామస్తులు వింతగా చూడటంతోపాటు తమ సెల్ ఫోన్లలో ఫొటోలు తీసుకున్నారు. ఎర్రని కళ్లు, రెక్కలు విప్పగానే నెమలి రెక్కల వలే పెద్దగా ఉన్నాయి. ఈ పక్షి రాత్రి సమయంలో మనుషులు అరిచినట్లుగా అరుస్తున్నట్లు ఇప్పగూడెం గ్రామస్తులు తెలిపారు. ఈ పక్షిని అడవి రామదాసు అనికూడా పిలుస్తారని తెలుస్తుండగా, దీని ఆహారంలో మిడతలు, ఇతర పెద్ద కీటకాలు, బల్లులు, ఎలుకలు ఉంటాయని, ఇది రైతులకు మేలు చేకూర్చే పక్షిగా తెలిసింది.

ఈపీఎఫ్‌ఓ సంస్కరణలతో అనేక ప్రయోజనాలు

హన్మకొండ అర్బన్ : ఈపీఎఫ్‌ఓ సంస్కరణలతో ఉద్యోగులు, యజమానులకు అనేక ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు వరంగల్ అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ ఆఫీసర్ (ఏపీఎఫ్‌సీ) శివకేష్ మీనా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల ఈపీఎఫ్‌ఓ నిబంధనల్లో జరిగిన మార్పులు, సభ్యులకు నిధుల ఉపసంహరణ ప్రక్రియను వేగవంతం చేయడమే కాకుండా సులభతరం చేసి పారదర్శకత పెంచామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఉన్న 13 రకాల ఉపసంహరణ నిబంధనలను మూడు విభాగాలుగా చేసి 12 నెలల సేవా కాలం తర్వాత 75 శాతం మొత్తం (ఉద్యోగి + యజమాని వాటా) ఎలాంటి డాక్యుమెంటేషన్ లేకుండానే ఉపసంహరించుకునే అవకాశం కల్పించామని వివరించారు. ఉపసంహరణకు అవసరమైన ఉద్యోగంలో పనిచేసిన కాలాన్ని 7 సంవత్సరాల నుంచి సంవత్సరానికి తగ్గించామన్నారు. కాగా, 75 శాతం మంది సభ్యులు 4 సంవత్సరాల్లోనే పెన్షన్ అక్యుములేషన్ మొత్తాన్ని ఉపసంహరించుకుంటున్నారని, తద్వారా భవిష్యత్‌లో పెన్షన్ అర్హత కోల్పోతున్నారని వివరించారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు 2 నెలల తర్వాత ఉపసంహరణకు అనుమతి ఉన్న నిబంధనను 36 నెలలకు పెంచామన్నారు. ఈ మార్పులు సౌలభ్యం, భద్రత, దీర్ఘకాలిక ప్రయోజనం మధ్య సమతుల్యతను కల్పించేందుకు తీసుకున్నవని వివరించారు.

కాంట్రాక్టు అధ్యాపకుల విరమణ వయసు పెంపు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కాంట్రాక్టు అధ్యాపకుల ఉద్యోగ విరమణ వయసును 65 ఏళ్లకు పెంపుదల చేస్తూ రిజిస్ట్రార్ వి. రామచంద్రం గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. దీనిపై ఇటీవలే కేయూ పాలకమండలిలో కూడా నిర్ణయించారు. దీంతో కాంట్రాక్టు అధ్యాపకులను కూడా రెగ్యులర్ ప్రొఫెసర్ల మాదిరి 65 ఏళ్ల వరకు ఉద్యోగంలో కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో కేయూ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు శ్రీధర్‌కుమార్‌లోథ్.. వీసీ ప్రతాప్‌రెడ్డికి, రిజిస్ట్రార్ రామచంద్రానికి కృతజ్ఞతలు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

న్యూశాయంపేట: వరంగల్ జిల్లా పరిధిలోని మైనారిటీ గురుకులాల్లో ఖాళీగా ఉన్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సనా సెక్యూరిటీ ఏజెన్సీ నిర్వాహకుడు మహ్మద్ హుస్సేన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హనుమకొండ కేయు క్రాస్‌రోడ్డులోని (వరంగల్ జీ1), బాలికల గురుకులంలో జేఎల్ ఫిజిక్స్ (1), జేఎల్ కెమిస్ట్రీ (1), వరంగల్ శంభునిపేట దూపకుంటరోడ్డులోని (వరంగల్, జీ2) బాలికల గురుకులంలో జేఎల్ తెలుగు (1) పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన మహిళా అభ్యర్థులు ఈనెల 21లోగా హనుమకొండ నయీంనగర్ పాత ఆర్టీఓ కార్యాలయం వద్ద ఉన్న సనా ఏజెన్సీ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. వివరాలకు 0870–3558539 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

జూనియర్ కాలేజీల సిబ్బందికి యూనిక్ ఐడీ

కాళోజీ సెంటర్: వరంగల్ జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలల సిబ్బంది సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ నంబర్ల ఫిజికల్ వెరిఫికేషన్ గురువారం పూర్తయ్యిందని డీఐఈఓ శ్రీధర్‌సుమన్ తెలిపారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు, సిబ్బంది ఇంటర్ విద్యాశాఖ కార్యాలయంలో స్వయంగా పరిశీలించిన తర్వాతే ధ్రువీకరిస్తున్నామని పేర్కొన్నారు. వివరాలు సరిగ్గా లేకుంటే తిరిగి కళాశాలలకు పంపిస్తున్నట్లు చెప్పారు. ఇంటర్ బోర్డు నూతన సంస్కరణల్లో భాగంగా సిబ్బందికి శాశ్వత యూనిక్ ఐడీ కేటాయిస్తున్నారని వివరించారు.

కళాక్షేత్రం అందుబాటులోకి తీసుకురావాలి

- కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత అంపశయ్య నవీన్
- ఘనంగా ఆచార్య పేర్వారం జగన్నాథం స్మారక పురస్కార ప్రదానం



పురస్కారం అందుకుంటున్న సాహితీవేత్తలు రామచంద్ర, వెంకటయ్య, శ్రీనివాసరావు

హన్మకొండ కల్చరల్: సాహిత్య సభలను నిర్వహించుకునేలా కాళోజీ కళాక్షేత్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ అన్నారు. గురువారం సాయంత్రం హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని పీఆర్ భవన్‌లో పేర్వారం జగన్నాథం ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య పేర్వారం జగన్నాథం స్మారక పురస్కారాన్ని 2023 సంవత్సరానికిగాను సాహితీవేత్త డాక్టర్ లింగంపల్లి రామచంద్రకు, 2024 సంవత్సరానికి సాహితీవేత్త డాక్టర్ పెద్ది వెంకటయ్య, 2025 సంవత్సరానికి కవి పొట్లపల్లి శ్రీనివాసరావుకు ప్రదానం చేశారు. కేయూ విశ్రాంత ఆచార్యులు బన్న అయిలయ్య అధ్యక్షతన జరిగిన ఈకార్యక్రమంలో డాక్టర్ అంపశయ్య నవీన్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. ఆచార్య పేర్వారం జగన్నాథం తనకు సన్నిహితులని, ఆయన పేరిట స్మారక పురస్కారం అందించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఈవీ శ్రీనివాసరావు, పేర్వారం జగన్నాథం ఫౌండేషన్ నిర్వాహకులు డాక్టర్ పేర్వారం శంకర్‌రావు, డాక్టర్ పేర్వారం శ్రీనాథ్, అస్నాల శ్రీనివాస్, కవయిత్రి గట్టు రాధికామోహన్, కవులు, రచయితలు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట

- సత్వర సర్వీస్‌లు మంజూరు
- టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి



కర్నాటి వరుణ్‌రెడ్డి, టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్

హన్మకొండ: వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని వారి అవసరాలకు అనుగుణంగా సేవలందిస్తున్నట్లు వివరించారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో 2023 సంవత్సరంలో 31,550 రిలీజ్ చేయగా 2024 సంవత్సరంలో 39,693 సర్వీసులను రిలీజ్ చేశామని, 2025 (అక్టోబర్ 16 వరకు) 34,306 సర్వీస్‌లు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. 2023తో పోల్చుకుంటే 2024 సంవత్సరంలో 8,143 సర్వీస్‌లు అధికంగా మంజూరు చేసినట్లు వివరించారు. ఇంకా మూడు నెలల సమయంలో ఉందని ఈలోపు గతంలోకంటే అధికంగా సర్వీస్‌లు మంజూరు చేస్తామన్నారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి కొత్తగా లైన్లు వేయాల్సిన అవసరం లేని సర్వీసులను నెల రోజుల్లో మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు తమ వాటా చెల్లించాల్సి ఉన్న సర్వీసులను రెండు నెలలో మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వ్యవసాయ సర్వీస్‌ల మంజూరుపై కమర్షియల్ విభా గాధికారులు 16 సర్కిళ్ల అధికారులతో ప్రతీ వారం సమీక్ష నిర్వహిస్తున్నట్లు, మెటీరియల్ కొరత లేదని పేర్కొన్నారు. రైతులు మెటీరియల్ కొనాల్సిన అవసరం లేకుండా అవసరమైన మేరకు సరఫరా చేస్తున్నమని స్పష్టం చేశారు. సర్వీస్‌ల మంజూరులో ఇబ్బందులుంటే టోల్ ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలని కోరారు.

విద్యుత్ కనెక్షన్ల జారీలో పారదర్శకత..

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల జారీలో మరింత పారదర్శకత తీసుకొచ్చామని, కొత్త కనెక్షన్ కోసం నమోదు చేసుకున్నప్పటి నుంచి సర్వీస్ రిలీజ్ అయ్యే వరకు ప్రతీ దశలోనూ మొబైల్ నంబర్‌కు తెలుగులో సమాచారం పంపిస్తున్నట్లు తెలిపారు. ఈమెస్సేజ్‌లో లింక్ కూడా పంపిస్తుండడంతో దాన్ని ఓపెన్ చేస్తే స్టేటస్ రిపోర్ట్ రైతులు తెలుసుకోవచ్చని సూచించారు. మెటీరియల్ త్వరితగతిన రిలీజ్ అయ్యేలా ఈ–స్టోర్ విధానాన్ని తీసుకొచ్చామని, పేపర్ పని లేకుండా ఆన్‌లైన్ ద్వారా బుక్ చేసి మెటీరియల్ డ్రా చేసుకునే సౌలభ్యం క్షేత్ర స్థాయి అధికారులకు కల్పించిందని, దీంతో రైతుల సర్వీసుల మంజూరు వేగంగా జరుగుతుందని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపునకు డిపార్ట్‌మెంట్ వాహనాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పొలం బాట ద్వారా రైతుల ముంగిటకు వెళ్లి వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు ఎన్పీడీసీఎల్ పరిధిలో 4,064 పొలం బాట కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు.

పుణ్యక్షేత్రాలకు భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు

నయీంనగర్: పుణ్యక్షేత్రాల సందర్శనార్థం యాత్రికుల సౌకర్యార్థం 'భవ్య గుజరాత్' పేరుతో ఈ నెల 26న భారత్ గౌరవ్ ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు ఐఆర్‌సీటీసీ మేనేజర్ పివి.వెంకటేశ్ తెలిపారు. గురువారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. మొత్తం 9 రాత్రులు, 10 పగలుతో గల ఈ ప్యాకేజీలో రైలు 26వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు రేణిగుంటలో బయల్దేరి గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, ఖమ్మం, కాజీపేట, సికింద్రాబాద్, నిజామాబాద్, నాందేడ్ మీదుగా ద్వారకా, సోమ్‌నాథ్, అహ్మదాబాద్, ఏకతానగర్, ప్రాంతాలు సందర్శించనుంది. టీ, టిఫిన్, భోజనం, రవాణా, హోటల్ గదులతో కలిపి టికెట్ ధర ఒకరికి స్లీపర్ క్లాస్ రూ.18,400, థర్డ్ ఏసి రూ.30200, సెకెండ్ ఏసీ 39,900 ఉంటుందని తెలిపారు. వివరాల కోసం 92810 30749 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నరేశ్ బాబు, సతీశ్ పాల్గొన్నారు.

నేడు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశం

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలోని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని కళాశాలల్లోని జాతీయ సేవాపథకం (ఎన్‌ఎస్‌ఎస్) ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశం శుక్రవారం క్యాంపస్‌లోని సేనేట్‌హాల్‌లో నిర్వహించనున్నట్లు కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఈసం నారాయణ గురువారం తెలిపారు. రిజిస్ట్రార్ వి. రామచంద్రం, స్టూడెంట్స్ అఫైర్స్ డీన్ మామిడాల ఇస్తారి, మైభారత్ పోర్టల్ డిప్యూటీ డైరెక్టర్ సి.హెచ్. అన్వేశ్, ఎన్ఎస్ఎస్ వరంగల్ జిల్లా కన్వీనర్ రాంబాబు, తదితరులు పాల్గొంటారని తెలిపారు.



- 'సాక్షి' ఫ్యామిలీతో మహిళా ఐపీఎస్‌ల మనోగతం

అమ్మ... నాన్న... నాలుగో సింహం





రోజుకు 5 నుండి 7 గంటలు తలను ఫోన్ ముందు వంచి గడపడాన్ని 'టెక్స్ట్ నెక్' అని పిలుస్తున్నారు. టెక్స్ట్ నెక్ అనేది మెడలోని కండరాలు, నరాలను ఒత్తిడికి గురి చేస్తుంది. ఒక వ్యక్తి గంటల తరబడి ఫోన్ ముందు వంగి ఉండడం వల్ల అది వెన్నుపూసల మధ్య డిస్క్‌లపై మూడు నుంచి అయిదు రెట్లు ఎక్కువ ఒత్తిడి కలిగిస్తుందంటున్నారు వైద్యనిపుణులు.



అణువంత ప్రోత్సాహంతో అంతులేనన్ని విజయాలు సాధిస్తామని నిరూపించారు. అపజయాలెన్ని ఎదురైనా వెరవకుండా లక్ష్యాన్ని సాధించి చూపారు. అమ్మానాన్నలు ఇచ్చిన ప్రోత్సాహం.. భరోసాతో దేశంలోనే అత్యున్నత సర్వీస్‌లలో ఒకటైన ఇండియన్ పోలీస్ సర్వీసెస్‌కు ఎంపికై శభాష్ అనిపించుకున్నారు. ఓ కూతురు కండక్టర్ అయిన తన తండ్రి కల నెరవేర్చితే... మరో కూతురు తన తండ్రి నుంచి పొందిన స్ఫూర్తితో సమాజ సేవకు సిద్ధమైంది. అమ్మ అండతో సాటి మహిళలకు భరోసాగా నిలిచే పోలీస్ అధికారి అవుతానని మరొకరు నిరూపించారు. నేషనల్ పోలీస్ అకాడమీలో విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న 174 మందిలో 77 ఆర్ఆర్ (రెగ్యులర్ రిక్రూటీస్) బ్యాచ్ ఐపీఎస్ అధికారులు నేడు నిర్వహించనున్న పాసింగ్ ఔట్‌పరేడ్‌తో బాధ్యతలు చేపట్టనున్నారు. ఈ సందర్భంగా బ్యాచ్‌లోని ముగ్గురు మహిళా ఐపీఎస్‌ల మనోగతం... వారి మాటల్లోనే...

అమ్మ ఇచ్చిన భరోసాతోనే ముందుకు వెళ్లా!
- జయశర్మ

నేను ఐపీఎస్ అధికారి అయ్యానంటే అందుకు వందశాతం మా అమ్మే కారణం. నేను ఓటమి పాలైన ప్రతిసారి నాలో ధైర్యాన్ని నింపింది అమ్మ. ఒత్తిడిలో కూరుకుపోయిన ప్రతిసారీ నాకు భరోసా ఇచ్చి నన్ను ఇక్కడివరకు నడిపింది మా అమ్మ నీతూశర్మే. నా పేరు జయశర్మ. నా స్వస్థలం హర్యానాలోని హిస్సార్. మా నాన్న ప్రమోద్ కుమార్ శర్మ. నాన్న డిస్ట్రిక్ట్ ఫుడ్ సప్లై కంట్రోలర్‌గా పనిచేస్తున్నారు. అమ్మ గృహిణి. నేను ఢిల్లీ యూనివర్సిటీలో బీఎస్సీ మ్యాథ్స్ ఆనర్స్, ఐఐటీ ఢిల్లీ నుంచి ఎమ్మెస్సీ మ్యాథమెటిక్స్ పూర్తి చేశాను. నాకు ఐపీఎస్ కావాలని చిన్ననాటి నుంచే కల. అమ్మ ప్రోత్సాహం, నాన్న అండతో నేను గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన తర్వాత సివిల్ సర్వీసెస్‌పై దృష్టి పెట్టా. ఇది ఎంతో కష్టమైన పని. కొన్నిసార్లు మనపై మనం నమ్మకాన్ని కోల్పోతాం. ఇది మన వల్ల కాదనిపిస్తుంది. అలాంటప్పుడు మనల్ని ప్రోత్సహించేవాళ్లు, భరోసా ఇచ్చేవాళ్లు ఎంతో అవసరం. నేను కూడా మూడుసార్లు సివిల్స్‌కి ఎంపిక కాకపోయినా నిరుత్సాహ పడలేదు. తప్పులు సరిచేసుకుంటూ ముందు వెళ్లా. ఐపీఎస్ ఎలాగైనా సాధించాలన్న నా పట్టుదలకు తోడు నా కుటుంబం, స్నేహితులు అండగా నిలిచారు. నాల్గో ప్రయత్నంలో నేను అనుకున్నట్టుగానే ఐపీఎస్‌కి ఎంపికయ్యాను.

నేషనల్ పోలీస్ అకాడమీ (ఎన్‌పీఏ)లో శిక్షణ పూర్తిగా భిన్నమైంది. నేను ఎన్‌పీఏలోకి రాకముందు కనీసం వంద మీటర్లు కూడా పరిగెత్తినట్టు గుర్తు లేదు. కానీ ఇక్కడ శిక్షణతో ఇప్పుడు ఒంటిపై బరువు, చేతిలో రైఫిల్‌తో 40 కిలోమీటర్లు కూడా రన్నింగ్ చేసేంత స్థైర్యం వచ్చింది. మహిళా ఐపీఎస్ అధికారిగా మహిళా భద్రత, సైబర్ భద్రతపై ప్రత్యేక దృష్టి పెడతాను.

నాలుగుసార్లు ఓడినా.. నాన్న ప్రోత్సాహం తగ్గలేదు
- అశ్విని.ఎస్

మా స్వస్థలం తమిళనాడులోని కన్యాకుమారి. నాన్న బస్ కండక్టర్‌గా పనిచేసి ఈ ఏడాది రిటైర్ అయ్యారు. అమ్మ గృహిణి. మా అక్క ప్రైవేటు ఉద్యోగిని. మేం ఇద్దరమూ అమ్మాయిలమే అయినా.. నాన్న మమ్మల్ని అన్నింటిలో ప్రోత్సహించేవారు. నేను అన్నా యూనివర్సిటీ నుంచి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో ఇంజినీరింగ్ పూర్తి చేశాను. ప్రభుత్వ అధికారిగా ఉంటేనే సమాజానికి దగ్గరగా పనిచేయవచ్చని నాకు మొదటి నుంచి ఉండేది. అందుకే ఇంజినీరింగ్ తర్వాత ప్రైవేటు ఉద్యోగాలవైపు వెళ్లలేదు. తమిళనాడులో స్టేట్ జీఎస్టీ విభాగంలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేశాను. కానీ.. నన్ను ఐపీఎస్ ఆఫీసర్‌ను చేయాలన్నది నాన్న కల. అయితే సివిల్స్‌కు ఎంపిక కావడం అంత సులువేం కాదు. ఐదో ప్రయత్నంలో ఐపీఎస్ సాధించానంటే నాన్న ఇచ్చిన ప్రోత్సాహమే కారణం. ఎప్పటికప్పుడు గతంలో చేసిన తప్పుల నుంచి పాఠాలు నేర్చుకుంటూ, వ్యక్తిగతంగా నోట్స్ తయారు చేసుకుంటూ నా ప్రయత్నాన్ని కొనసాగించాను. చివరికి విజయం దక్కింది. ఎన్నో కొత్త విషయాలను నేర్చుకునే అవకాశంతోపాటు మనలో ఉన్న సామర్థ్యాన్ని మనకు తెలియజేస్తుంది నేషనల్ పోలీస్ అకాడమీ ట్రైనింగ్. ఈ శిక్షణ తర్వాత నేను ఎంతో భరోసాగా చెప్పగలను – పోలీస్ ఉద్యోగం మహిళలు కూడా ఎంతో బాగా చేయగలరని! మా బ్యాచ్‌లో కూడా 65 మంది మహిళా ఐపీఎస్‌లు ఉండడమే అందుకు ఉదాహరణ. సివిల్స్‌కి ప్రిపేర్ అవుతున్న వాళ్లకి నా సలహా ఒక్కటే..సివిల్స్ సాధించడం అనేది మీ లక్ష్యం అయితే, ఎన్ని అడ్డంకులు వచ్చినా మధ్యలో వదలొద్దని ముందే నిర్ణయించుకోవాలి. ఒత్తిడి లేకుండా ప్రణాళిక ప్రకారం పరీక్షలకు సిద్ధం కావాలి. అప్పుడు విజయం మనదే.

నాకు స్ఫూర్తి మా నాన్నే
- కీర్తియాదవ్

నాన్న ఎయిర్ మెన్‌గా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో పని చేసి రిటైర్ అయ్యారు. ఇంట్లో ఎంతో క్రమశిక్షణ ఉండేది. నా చిన్నప్పటి నుంచి నాన్నను అలా యూనిఫాంలో చూస్తూ పెరగడంతో నాకు కూడా యూనిఫాం సర్వీసెస్ అంటే ఎంతో గౌరవం ఏర్పడింది. ఆయనే నాకు ఎప్పటికీ స్ఫూర్తి. స్కూలింగ్ పూర్తయి, కాలేజీకి వచ్చాక నాకు స్పష్టత వచ్చింది ఐపీఎస్ అధికారి అయితే ప్రజలకు నేరుగా సేవ చేసే అవకాశం ఉంటుందని. అందుకే ఎప్పటికైనా ఐపీఎస్ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు వెళ్లా. అయితే గ్జేవియర్స్ కాలేజ్ కోల్‌కతా నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తయి తర్వాత నేను మొదటి ప్రయత్నంలో సీఐఎస్‌ఎఫ్‌లో అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎంపికయ్యాను. 2020లో ట్రైనింగ్ చేస్తూనే సివిల్స్ ప్రిపరేషన్ కొనసాగించాను. ఆ తర్వాత ఇండియన్ ఫారెస్ట్ సర్వీసెస్‌కు ఎంపికయ్యాను. అయినా, ఐపీఎస్ కలను వదల్లేదు. నాల్గో ప్రయత్నంలో నాకు ఐపీఎస్ వచ్చింది. నాన్న ఎయిర్‌ఫోర్స్‌లో పనిచేయడం.. మొదటి నుంచి ఎంతో క్రమశిక్షణతో పెరగడంతో ఇక్కడి ట్రైనింగ్ కష్టంగా అనిపించలేదు. సులువుగానే శిక్షణ పూర్తి చేశా. ఇక్కడ నేర్చుకున్న విషయాలు వృత్తిగతంగానే కాకుండా వ్యక్తిగతంగా నన్ను ఎంతో మార్చాయి. నాకు తెలంగాణ పోలీసులో మహేశ్ భగవత్ ఇన్‌స్పిరేషన్. ఐపీఎస్ అధికారిగా నేను మహిళా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాను. నేను హర్యానాలో పుట్టిపెరిగాను. అక్కడి పరిస్థితులు చూశాక..మహిళా భద్రతకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయం తీసుకున్నా.

– నాగోజు సత్యనారాయణ, స్టేట్ క్రైమ్ రిపోర్టర్, సాక్షి, హైదరాబాద్
ఫొటోలు : ఏ. జాన్

● నయా వంచన | డిజిటల్ మోసాలు

పండగ రోజులు కదా... ఎర వేస్తారు!

స్టే స్మార్ట్ స్టే సేఫ్



పండగ కదా.... ఆన్‌లైన్ షాపింగ్ ప్రయత్నాలలో ఉన్నప్పుడు 'ఫ్రీ దీపావళి గిఫ్ట్' అంటూ పాపప్ కనిపించవచ్చు. 'ఈ ప్రశ్నలకు జవాబు చెప్పి దీపావళి బహుమతులు గెలుచుకోవచ్చు' అనే ప్రకటన మెరుపులా మెరియవచ్చు.

దీపావళిని పురస్కరించుకొని దుస్తుల నుంచి వస్తువుల వరకు ఆన్‌లైన్ షాపింగ్ ఊపందుకుంటుంది. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ మోసగాళ్లకు చేతినిండా పనే!

పండగ రోజుల్లో ఆన్‌లైన్ స్కామ్‌లు ఎక్కువగా జరగడానికి అవకాశం ఉంది. నకిలీ ఈ–మెయిల్స్, టెక్స్ట్, కాల్స్ ద్వారా స్కామ్‌లు జరుగుతుంటాయి. ఈ పండగ సీజన్‌లో మోస్ట్ కామన్ స్కామ్... నకిలీ ఆర్డర్ లేదా అకౌంట్. మీ అకౌంట్ తాత్కాలికంగా నిలిపివేయబడిందని, ఆర్డర్‌కు పేమెంట్ వెరిఫికేషన్ అవసరమని పేర్కొంటూ హానికరమైన లింక్‌లను క్లిక్ చేసేలా, వ్యక్తిగత వివరాలు షేర్ చేసే విధంగా కస్టమర్‌లను ప్రేరేపిస్తారు.

'గత సంవత్సరం 55,000 ఫిషింగ్ వెబ్‌సైట్‌లను, 12,000 స్కామ్ ఫోన్ నంబర్లను బ్లాక్ చేశాం. పండగ సీజన్ ముందు ఆన్‌లైన్ స్కామ్‌లపై వినియోగదారులకు అవగాహన కలిగించడానికి ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్‌తో కలి పనిచేశాం' అన్నారు అమెజాన్ ఇండియా, వైస్ ప్రెసిడెంట్ (లీగల్) రాకేష్ బక్షీ.

'స్కామర్‌లు నకిలీ షాపింగ్ వెబ్‌సైట్‌లను లేదా అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లాంటి ప్రసిద్ధ బ్రాండ్‌లను అనుసరించి ఆన్‌లైన్ ప్రకటనలను సృష్టిస్తారు. నమ్మశక్యం కాని డిస్కౌంట్‌లతో ఆకట్టుకునే ప్రయత్నం చేస్తారు. పరిమిత కాల ఆఫర్‌లతో కస్టమర్‌లను ఆకర్షిస్తారు. ఒక కస్టమర్ ఆర్డర్ చేసి చెల్లింపు చేసిన తర్వాత నకిలీ ప్రొడక్ట్స్ అందుతాయి. అసలు ఏమీ అందకపోవచ్చు కూడా. నకిలీ వెబ్‌సైట్‌లు తరచుగా అధికారిక బ్రాండ్ లోగోలు, ప్రొడక్ట్ ఇమేజ్‌లను, చట్టబద్ధమైన సైట్‌లను తలపించేలా పాలిష్ చేసిన డిజైన్‌లను ఉపయోగిస్తాయి. కొందరు నిజమైన వెబ్‌సైట్‌ల లేఅవుట్, డొమైన్ పేరును కూడా క్లోన్ చేస్తారు. తేడాను గుర్తించడం కష్టంగా ఉంటుంది' అంటున్నారు సైబర్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్ శుభంసింగ్.

చాలామంది స్కామర్‌లు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లాంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో ఫేక్ 'గివ్ అవే' పోటీలు లేదా లక్కీ డ్రాల గురించి పోస్ట్ చేస్తారు. మీ బ్యాంక్ వివరాలను షేర్ చేయమని లేదా క్లెయిమ్ యువర్ ప్రైజ్ లింక్‌పై క్లిక్ చేయమని అడగవచ్చు. వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని ఎప్పుడూ షేర్ చేయవద్దు.

అనుమానాస్పద ఎకౌంట్‌ల గురించి వెంటనే రిపోర్ట్ చేయండి. బ్లాక్ చేయండి. బ్యాంక్ స్టేట్‌మెంట్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోండి.

స్త్రీ హెల్త్‌పై దృష్టిపెట్టాలి


కృతిసనన్

చలం, అంబేద్కర్‌ల నుంచి నటి, ఐక్యరాజ్యసమితి పాపులేషన్ ఫండ్ (యూఎన్‌ఎఫ్‌పీఏ) జెండర్ ఈక్వాలిటీకి ఈ దేశపు రాయబారి కృతిసనన్ దాకా అందరి మాటా ఒకటే స్త్రీ ఆరోగ్యమే దేశ భవిష్యత్ భాగ్యం అని!

నిజానికి మహిళా ఆరోగ్యం, లింగ సమానత్వం గురించి మాట్లాడుకోవడానికి ప్రత్యేక సందర్భం అక్కర్లేదు.. అయినా ఈ ప్రస్తావనకు ప్రత్యేక సందర్భమూ ఉంది. అదే బెర్లిన్ (జర్మనీ)లో జరిగిన వరల్డ్ హెల్త్ సమ్మిట్ 2025. ఇందులో ఆమె మహిళల ఆరోగ్యం మీద శ్రద్ధ పెట్టాల్సిన అవసరం గురించి మాట్లాడారు. ఇలా వరల్డ్ హెల్త్ సమ్మిట్‌లో ప్రసంగించిన తొలి భారతీయ నటిగా కీర్తి గడించారు. ఆ ప్రసంగంలో కీర్తి సనన్ ఏం మాట్లాడారంటే..

'మహిళల ఆరోగ్యం నిర్లక్ష్యం చేయాల్సిన లేదా పక్కన పెట్టాల్సిన విషయం కాదు. తక్షణమే దృష్టిపెట్టాల్సిన అత్యంత అవసరమైన అంశం. ఆమె ఆరోగ్యం.. మానవాళి ప్రగతికి, భవిష్యత్‌కు మూల స్తంభం. అందుకే మహిళా ఆరోగ్యానికి సంబంధించి సుస్థిరమైన పెట్టుబడులు కావాలి. ఆవిష్కరణలు జరగాలి. ఇందుకోసం చేసే ప్రతి ప్రయత్నం అద్భుతమైన ఆర్థిక, సామాజిక మార్పులుగా ప్రతిఫలిస్తుంది. ఏటా ముప్పై కోట్లు ఇన్వెస్ట్ చేస్తే పదమూడు వందల కోట్ల రాబడి కనిపిస్తోంది. అంటే దాదాపు తొమ్మిది రెట్ల లాభం. ఈ ఇన్వెస్ట్‌మెంట్ నైతికావసరమే కాదు మన మూకుమ్మడి భవిష్యత్‌కు భరోసా కూడా! ఎందుకంటే మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు, సమాజం.. ఆరోగ్యంగా ఉంటాయి. ఆరోగ్యవంతమైన సమాజం ఆర్థిక సుస్థిరతకు చిహ్నం. కానీ ప్రపంచ జనాభాలో సగంగా ఉన్న మహిళల ఆరోగ్యం ఏళ్లుగా నిర్లక్ష్యానికి గురవుతూనే ఉంది. యూఎన్‌ఎఫ్‌పీఏ జెండర్ ఈక్వాలిటీ అంబాసిడర్‌గా చాలా ప్రాంతాలు తిరిగాను. అవన్నీ కూడా బాల్యవివాహాలకు సాక్ష్యంగా కనపడ్డాయి. అమ్మాయిలకు మానసిక ఆరోగ్యం సంగతి అటుంచి కనీసం శారీరక ఆరోగ్య కేంద్రాలు కూడా అందుబాటులో లేని దుస్థితిలో ఉన్నాయి. వీళ్ల జీవితాలు మారాలంటే మహిళల ఆరోగ్యానికి సంబంధించి దృష్టి పెరగాలి. తక్షణమే ఆ దిశగా కార్యాచరణ నిర్ణయాలు జరగాలి' అన్నారు కృతిసనన్.

ఫ్యాషన్

పండగలకు, సంప్రదాయ వేడుకలకూ నిండైన హుందాతనాన్ని తీసుకువచ్చేలా కట్టూ బొట్టు విషయంలో అతివలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటారు. ఈ దీపావళి వేళ మరింత స్పెషల్‌గా కనిపించాలనుకునే వారికోసం బెంగాలీ చీరకట్టు ఆధునికతనూ అద్దుకొని కొంగొత్తగా మెరిసిపోతుంది. సెలబ్రిటీలూ ముచ్చటపడే ఈ కట్టుకు వారు జోడించే హంగులు ఇవి...

పండగంతా నిండుగా...



పండగలు, ఇతర సంప్రదాయ వేడుకలలో బెంగాలీ స్టైల్ చీర కట్టును దేశవ్యాప్తంగా మహిళలు ధరించడానికి ఇష్టపడుతున్నారు. ఉత్తేజాన్ని కలిగించే ఎరుపు–తెలుపు కాంబినేషన్‌లో ఉండే ఈ చీర కట్టు, నుదుటన పెద్ద బిందీ, శంఖం ఆకృతిలో నెక్ డిజైన్, చీర పల్లూకున్న అందమైన డిజైన్.. ఇవన్నీ పండుగను మరింత ప్రత్యేకంగా చేస్తాయి. దుర్గాపూజల సమయాల్లో ఈ రంగు చీరలను బెంగాలీలు ప్రత్యేకంగా ధరిస్తారు. ఆ స్టైల్ కట్టును ఇప్పుడు లక్ష్మీ పూజలు, వివాహ వేడుకల సమయాల్లో ధరించడానికి ఆసక్తి చూపుతున్నారు. అయితే, ఈ కట్టును మనం అనుసరించాలంటే మాత్రం ఈ సూచనలు తప్పక అవసరం.

హెయిర్ స్టైల్- మేకప్

హెయిర్ స్టైల్ కోసం ఒక బన్ తయారు చేసి, దానిని మల్లె పువ్వులు లేదా ఎరుపు, తెలుపు పువ్వులతో అలంకరించవచ్చు. పువ్వులతో కాకున్నా హెయిర్ బన్‌కు హెయిర్ పిన్ జ్యువెలరీని జోడించడం ద్వారా అందాన్ని పెంచుకోవచ్చు. మేకప్ కోసం ఎరుపు లిప్‌స్టిక్, తేలికపాటి ఐ మేకప్ సరిపోతాయి. ధరించిన చీరకు మేకప్ సెట్ అవుతుందా అనేది సరి చూసుకుంటే చాలు. మెడలోనూ, చేతులకు ఎక్కువ నగల లేకుండా చూసుకుంటే చాలు. మీ రూపం ఆధునికతను అద్దుకున్న సంప్రదాయంతో కొంగొత్తగా మెరిసిపోతుంది.







ఎంపికలో సరైన చీర

పూజలు, నోములు, వ్రతాల సమయంలో ఎరుపు అంచుతో ఉన్న తెలుపు లేదా ఆఫ్–వైట్ బేస్ చీరను ఎంచుకోవాలి. అంచు ఉన్న కాటన్, పట్టు లేదా టస్సర్ చీరలు ఈ బెంగాలీ లుక్‌కు సరైనవి. వీటిలో మనవైన చేనేతలు కూడా ఉండవచ్చు. ఈ చీరకట్టు సౌకర్యంగా ఉండటమే కాకుండా పూజ, పండగల సమయాల్లో రోజంతా ధరించడం సులభం కూడా.

కట్టుతో కట్టడి

బెంగాలీ స్టైల్‌లో నిజమైన ఆకర్షణ దాని డ్రేపింగ్ శైలిలోనే ఉంటుంది. చీర కుచ్చిళ్ల నుంచి ఎడమ వైపుగా, పొడవాటి పల్లూను ఛాతీ మీదుగా భుజం వరకు తీసుకుంటూ వెళ్లాలి. పొడవాటి పల్లూ భాగాన్ని కుడి చేతి భుజం కిందుగా తీసి, పైకి అంచు భాగం కనిపించేలా బ్లౌజ్‌కు జత చేయాలి. పొడవుగా తీసుకున్న కొంగు భాగాన్ని కుడి చేత్తో ముందుకు తీసుకువచ్చి పట్టుకోవడం కూడా ఈ కట్టులో అందంగా కనిపిస్తుంది. భుజం మీదుగా తీసిన పల్లూని కొప్పుకు అటాచ్ చేసి, ఎడమ భుజం కిందుగా తీసుకురావచ్చు. ఈ కట్టు లలనల రూపాన్ని మరింత సంప్రదాయంగా మారుస్తుంది. డ్రేపింగ్ చేసేటప్పుడు, కుచ్చుల భాగం మడతలు లేకుండా సెట్ చేసి, పల్లూ చాలా తేలికగా ఉన్నట్టు చూసుకోవాలి.

నగలపై ప్రత్యేక శ్రద్ధ

పెద్ద పెద్ద చెవిపోగులు, గాజులు, నెక్లెస్‌లు ఈ స్టైల్ చీరకట్టుకు రాయల్ టచ్‌ను జోడిస్తాయి. హెవీగా ఆభరణాలు అక్కర్లేదు అనుకుంటే పెద్ద చెవిపోగులు, గాజులు ఈ అలంకరణకు సరిపోతాయి.

గుండ్రని వెడల్పాటి బిందీ

బెంగాలీ స్టైల్ డ్రేపింగ్ సంపూర్ణం కావాలంటే నుదుటన పెద్ద, గుండ్రని ఎరుపు బిందీ తప్పక ఉండాలి. ఇది పండుగల రోజుల్లో మొత్తం మేకప్‌ను పూర్తి చేస్తుంది. నుదుటిపై బిందీతో పాటు సిందూర్ చుక్కలను కూడా అదనంగా పెట్టడం వల్ల లుక్ మరింత మెరుగవుతుంది. ఈ లుక్‌కి ఎరుపు లేదా ముదురు గులాబీ రంగు బిందీ ఆకర్షణీయంగా కనిపిస్తుంది.

● టెక్నాలజీ

ఇంటిపని నుంచి తోటపని వరకు... ఫిగర్ వో 3





'ఫిగర్ ఏఐ' అనేది హ్యూమన్ రోబోలకు సంబంధించిన స్టార్టప్. తాజాగా 'ఫిగర్ వో 3' అనే హ్యూమన్ రోబో గురించి ప్రకటించింది కంపెనీ. 'రోజువారీ అవసరాలకు ఉపయోగపడే సాధారణ హ్యూమనాయిడ్ రోబో ఇది. గదిని శుభ్రం చేయడం, మొక్కలకు నీళ్లు పెట్టడం, ఆహారాన్ని వడ్డించడం, గిన్నెలు కడగడం, బట్టలు మడత పెట్టడం...మొదలైన ఎన్నో పనులు చేస్తుంది' అని 'ఫిగర్ వో 3' వివరాలు వెల్లడి చేసింది కంపెనీ. కాలిఫోర్నియాకు చెందిన 'ఫిగర్ ఏఐ' స్టార్టప్ మునుపటి తరం హ్యూమనాయిడ్‌లతో పోల్చితే సరికొత్త, సాంకేతికంగా ఒక అడుగు ముందుండే హ్యూమనాయిడ్స్ దృష్టి పెట్టింది. పూర్తిగా రీడిజైన్ చేసిన సెన్సరీ సూట్, హ్యాండ్ సిస్టమ్, నెక్స్ట్ జనరేషన్ విజన్ సిస్టమ్‌తో ఈ సరికొత్త హ్యూమనాయిడ్ రోబో మార్కెట్‌లోకి అడుగు పెట్టనుంది.

బులియన్
బంగారం 10 గ్రా.; వెండి కిలో అక్టోబర్ 16న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,31,900	1,31,320	1,29,440	1,31,320	1,31,300	1,29,810
బంగారం (22 క్యారెట్లు)	1,22,790	1,18,650	1,18,650	1,22,210	1,20,800	1,19,000
వెండి	1,90,000	1,82,900	2,06,000	1,82,900	1,80,000	2,06,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.